అన్నపూర్ణమ్మగారి అబ్బాయికి. అమ్మాయికి ఒకే పందిట్లో పెళ్ళిళ్ళు జరిగాయి. పదహారు రోజుల పండుగ అయిపోయింది. ఆ వేళ అన్నపూర్ణమ్మగారమ్మాయి సుందరి కాపురానికి వెళ్తే. వారి కోడలు విజయ వీరింటికి కాపురానికి వస్తుంది. కూతుర్ని కాపురానికి పంపే హడావిడిలో వుంది అన్నపూర్ణమ్మ. సామాన్లు సర్దుతూ మధ్య మధ్య కూతురికి 'హితబోధ' చేస్తోంది.

# ఎదురుదెబ్బ



వి. సంపూర్ణాదేవి

"ఇదిగో. సుందరీ. గొప్పలకి పోయి రేపట్నించి అత్తారింట్లో పనంతా నెత్తిన వేసుకునేవు! పనెక్కువగా వుందనిపిస్తే గుండెలో నొప్పిగా వుందని లేకపోతే తల నొప్పిగా వుందనీ ఏదో ఒకటి చెప్పు. రోజూ హార్లిక్స్ పాలతోతాగే అలవాటని చెప్పు. అత్తా. ఆడపడుచులతో మరీ చనువుగా వుండకు. ముప్పై వేలు కట్నం ముక్కు పిండి మరీ వసూలు చేసిందిగా నీ అత్త! నువ్వేం భయపడాల్సిన పనిలేదు. వేరు కాపురం పెట్టే వరకూ నువ్వు బెట్టుసరిగా వుండిపో." అంటూ అంతటితో ముగించింది అన్నపూర్ణమ్మగారు.

ఆ వేళ సాయంత్రం మూడున్నర గంటలకు సుందరి అత్తవారింటికి వెళ్ళిపోయింది చెల్లెల్నీ. తమ్ముణ్ణీ తోడుగా తీసుకొని. ఆరుగంటలకు విజయ అత్తవారింట్లో అడుగుపెట్టింది, అన్నయ్య తోడురాగా. ఆమె నలభై అయిదువేలు కట్నం తెచ్చింది.

కోడలి రాకకు కూడా చాలా హడావిడే పడ్డారు అన్నపూర్ణమ్మగారు. ఆ రోజు గడిచిపోగా మరునటిరోజు నుంచీ. కోడలుకి మరోరకం 'హితబోధ.' ప్రారంభించింది. అత్తమామలకు ఎలా అణిగి మణిగి వుంటే కీర్తి వస్తుందో. ఇంట్లో పనంతా సంబాళించుకుంటూ అందరి మన్ననలు పొందడం ఎలాగో చెప్పడం సాగించింది, ఉదాహరణలతో సహా. అత్తగారి హితోక్తులన్నీ కోడలు చిరునవ్వుతో విందే. అమ్మయ్య అనుకుంది అన్నపూర్ణమ్మ.

ఆ వేళ ఉదయంనుంచీ వంటింటిని కోడలికి అప్పజెప్పాలని అన్నపూర్ణమ్మ ఆలోచన. ఆరైనా విజయ నిద్ర లేవకపోతే ఎనిమిదేళ్ళ శశిని పంపింది గదిలోకి వదిన్ని లేపమంటూ. శశి రివ్వున వచ్చి,

"వదినకు గుండెలో నొప్పిగా వుందిటమ్మా అలవాటులేక కాఫీ తాగి అలాగయిందట. బోర్నవిటా కలిపి తీసుకు రమ్మనాడదన్నయ్య" అంటూ చెప్పింది. శిలైపోయిన అన్నపూర్ణమ్మలో చైతన్యం ఎప్పుడు కలిగిందో తెలియదు. ●

కొత్తరచయితల

మినీకథలు

కొత్తరచయితల

గుమాస్తా గిరిలో చేరినప్పటినుంచీ నాకు బడ్జెట్ బ్రతుకు ప్రారంభమైంది. ఇంటి బాడుగ నుంచీ సైకిల్‌కి గాలి కొట్టించేవరకూ అంతా బడ్జెటే! ఎక్కడ క్రమం తప్పినా ఆ నెలంతా తిప్పలే!

మా చిన్నాడు ప్రభుత్వ పాఠశాలలో ముచ్చటగా మూడవ తరగతి వెలగబెడ్తూ వున్నాడు. స్కూలునుంచి వచ్చిందే పుస్తకాలు అక్కడ పారేసి పిల్లలతో ఆడుకోవడానికి పరుగెత్తడం వాడికి అలవాటే. వాడి ఫ్రెండ్సుతో కలసి అవి కావాలి. ఇవి కావాలి అంటూ నన్ను ఏడ్పించడం కూడా మామూలే!

ఇప్పుడొక క్రొత్త సమస్యని సృష్టించాడు—

రబ్బరు బెలూను కావాలంటూ ఒకటే గొడవ!

పోనీ. పరవాలేదులే. అని వరుసగా మూడు రోజులు ముప్పై పైసలు ఖర్చుపెట్టి తీసుకువస్తే—

పది నిముషాలు కూడా వుంచుకోడు. క్రొత్తవి కావాలంటూ ప్రాణాలు తీస్తాడు.

అందుకే—

రెండు రాత్రులు నిద్ర మేల్కొని మరీ ఆలోచించి.

ఒక నిర్ణయానికి వచ్చాను—

ప్రభుత్వం వారు సరఫరా చేసే "నిరోధ్" బుడ్డలని పట్టుకొచ్చి ఇచ్చాను.

నా తెలివికి నేనే సంబరపడ్డాను.

రెండు రోజులు గడిచిందో. లేదో తిరిగి ప్రారంభించాడు భాగోతం—రంగురంగుల బెలూన్లు కావాలంటూ!

"వీటికేమైందిరా! రంగుల బెలూన్లకన్నా ఇవి పెద్దవి కూడాను!" నర్ది చెప్పడానికి ప్రయత్నించాను.

# ఈకాలం పిల్లలు

ఆర్. సి. కృష్ణస్వామిరాజు



వాడు నన్ను చిన్నపిల్లాణ్ణి చూసినట్లు చూసి—

"ఈ బెలూనులు పెద్దాళ్ళు ఆడుకొనేవటగా! నాకు చిన్నపిల్లలు ఆడుకొనే రంగు రంగుల బెలూన్లు కావాలి!" అంటూ డిమాండ్ చేశాడు.

'డిగ్రీ పూర్తయ్యే దాకా నాకు ఈ బెలూన్ల గూర్చి తెలియదు. వీడికెలా తెలిసిందబ్బా?' అనుకుని చిన్నగా ప్రశ్నించాను. వాడికి ఆ విషయాన్ని ప్రక్కింటి మూడేళ్ళ ఉష చెప్పిందట. ఈ కాలం పిల్లలు మూడేళ్ళకే పెద్దాళ్ళయిపోతున్నారేమో ననిపించింది. రంగుల బెలూన్లు కొనివ్వక తప్పింది కాదు. ●